RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు పారదర్శకంగా చేపట్టాలి..!

### డీఆర్వో కె. మల్లికార్జునుడు



కడప, మహి న్యూస్ ఆగస్టు 18: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్‌లో జిల్లా.కలెక్టర్ ఆదేశాల మేరకు.. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామచంద్ర, మున్సిపల్ కమీషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులతో డిఆర్వో మల్లికార్జునుడు సమావేశం నిర్వహించారు. జిల్లాలో గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను చక్కటి ప్రణాళికతో నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల సిబ్బంది నియామకం, ఎన్నికలకు సంబంధించిన సామగ్రి, ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ తదితర ప్రక్రియలను త్వరితగతిన చేపట్టాలన్నారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఇంటింటి సర్వే ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించి, 21, 22 తేదీల్లో ఓటర్ల జాబితాల్లో గుర్తించనున్నారు. 23న ముసాయిదా జాబితా ప్రచురించి, 24 నుంచి 26 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 27 నుంచి 31 వరకు అభ్యంతరాలపై విచారణ నిర్వహించి, సెప్టెంబరు 1 నుంచి 4 వరకు గ్రామసభల్లో జాబితాలను ధ్రువీకరిస్తారని, అలాగే.. సెప్టెంబరు 5న తుది జాబితాను ప్రచురిస్తారన్నారు. ప్రతి పంచాయతీకి ప్రత్యేక గుర్తింపు అధికారిని నియమించి, ఇతర శాఖల జాబితాలతో వివరాలను సరిపోల్చి పరిశీలించాలని డీఆర్వో సూచించారు. ఓటర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను ఎరుపు బాల్‌పాయింట్ పెన్‌తో స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. పేరు చేర్పు కోసం ఫారం-2, అభ్యంతరాలకు ఫారం-3, స్వయంగా తన పేరుపై అభ్యంతరం తెలిపేందుకు ఫారం-4 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసి, నిర్ణీత గడువులో తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.





## దేశంలోనే ప్రతిష్టాత్మకంగా “స్టార్టప్ కడప”..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మహి న్యూస్ ఆగస్టు 18: యువతలోని సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందించి, ఉద్యోగాలు వెతికే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో భారతదేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్మించిన “స్టార్టప్ కడప” ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ దేశానికే ఆదర్శంగా నిలవనుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనతో కలిసి నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన “స్టార్టప్ కడప” నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. “ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్టప్” అనే ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా ఈ కేంద్రాన్ని రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. యువతలో కొత్త ఆలోచనలను ప్రోత్సహించడం, వాటిని వ్యాపార అవకాశాలుగా మలచేందుకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సహకారం అందించడం కేంద్రం ప్రధాన ఉద్దేశమన్నారు. అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు, పనిచేసుకునే ప్రదేశాలు, శిక్షణా కేంద్రాలు, సమావేశ మందిరాలు, వ్యాపార సలహా సేవలు తదితర వసతులతో ఈ కేంద్రం అందుబాటులోకి రానుందని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి పొందేవారు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇది ఒకే వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది... 100 వరకు వివిధ రంగాలకు చెందిన కొత్త స్టార్ట్ అప్ సంస్థలను ఏర్పాటు చేసే దిశగా ఈ సెంటర్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకారాన్ని అందిస్తుందన్నారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ప్రస్తుతం తుది మెరుగులు, ఉద్యానవన, సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన ఆఫీస్ ఇంటీరియర్ సెటప్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. సమీక్షలో కడప నగర పాలక సంస్థ కమిషనర్ భవానీ ప్రసాద్, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, హౌసింగ్ పీడీ రాజారత్నం, కాంట్రాక్టర్లు, ప్రాజెక్టు రూపకర్తలు, ఏడిపీ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.






## విఆర్ఏ ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జి. భోగేశ్వరయ్య




గాలివీడు:ఆగష్టు18(మహి న్యూస్): ఉమ్మడి కడప జిల్లా సీనియర్ నాయకుడిగా, వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించిన అన్నమయ్య జిల్లాకు చెందిన జి. భోగేశ్వరయ్య విఆర్ఏ ల వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం ఆయన అనేక ఉద్యమాలు చేపట్టి, ఆమరణ నిరాహార దీక్షలు సైతం నిర్వహించి, సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ఆయన సేవలను గుర్తించిన సంఘం నాయకత్వం రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లిపోగు నాగేశం సంయుక్త ప్రకటనలో భోగేశ్వరయ్య ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి సంఘం మరింత బలోపేతంగా పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా భోగేశ్వరయ్య ఎన్నిక కావడం పట్ల వీఆర్ఏలు, సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### తోటపేటలో ఈగల్ పల్లెబాట - రచ్చబండ కార్యక్రమం.




తాళ్ళరేవు, మహి న్యూస్, ఆగస్టు 18: తాళ్లరేవు మండల పరిధిలోని తోటపేట గ్రామంలో “ఈగల్ పల్లెబాట -- రచ్చబండ” కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులతో ఈగల్ సిబ్బంది ముఖాముఖిగా మాట్లాడి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ సిబ్బంది మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు, కుటుంబాలు, సమాజంపై తీవ్ర దుష్పరిణామాలు ఏర్పడతాయని వివరించారు. యువత చెడు స్నేహాలకు లోనుకాకుండా తమ లక్ష్యాలపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలు, యువత, విద్యార్థులకు సూచించారు. సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరంగి పోలీస్ సిబ్బంది, ఈగల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, పి. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
### రెవెన్యూ సేవల పురోగతిపై సమీక్ష



కడప, మహి న్యూస్ ఆగస్టు 18: ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించడంతో పాటు పెండింగ్ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని మండలాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమావేశంలో రెవెన్యూ, ప్రజా సేవలకు సంబంధించి 12 ప్రధాన ప్రమాణికాల్లో పురోగతిపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు.. జేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిఆర్వో మల్లికార్జునుడు, జిల్లా రిజిస్ట్రార్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, భూసర్వే పునఃపరిశీలన, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, భూముల బదలాయింపులు, 22-ఏ కేసులు, చుక్కల భూములు, భూసేకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపు, ఐవీఆర్ఎస్, ఇతర సామూహిక సమస్యలు, జెడ్హెచ్‌డీసీ భూములు, ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డులు, భూముల డిజిటలీకరణ తదితర అంశాలపై మండలాల వారీగా పురోగతిని సమీక్షించారు. సమావేశంలో చర్చించిన అంశాల జాబితాలో ప్రజా ఫిర్యాదులు, పునఃసర్వే, 22-ఏ కేసులు, భూసేకరణ, భూముల కేటాయింపు, ఐవీఆర్ఎస్, జెడ్హెచ్‌డీసీ, డిజిటలీకరణ తదితర అంశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సేవలకు సంబంధించిన 12 ప్రధాన అంశాలపై ప్రతి నెలా రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి, పురోగతిని పరిశీలిస్తామన్నారు. జిల్లాలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్‌లో ఉన్న దశలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పునఃసర్వేకు అనుకూలమైన 710 గ్రామాలు ఉండగా, వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నట్లు సమావేశ నివేదికలో పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, కేవలం పరిష్కరించినట్లు చూపకుండా ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై సమావేశ నివేదికలో ముందస్తు, అనంతర పరిశీలనల వివరాలను కూడా నమోదు చేశారు. 22-ఏ జాబితాలో తప్పుగా నమోదైన భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దాలని, అర్హులైన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని తప్పు నమోదులను తొలగించడం ద్వారా 432 మందికి సంబంధించిన 674.79 ఎకరాల భూములకు పరిష్కారం లభించినట్లు తెలిపారు. జెడ్ హెచ్డీసీ భూములకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పరిశీలించి, అవసరమైన లోపాలను వెంటనే సరిచేసి పంపాలని సూచించారు. సంబంధిత ప్రతిపాదనల్లో కుల ధ్రువపత్రాలు, కుటుంబ సభ్యుల సమ్మతి, ఇతర పత్రాల లోపాలను గుర్తించి త్వరగా సరిచేయాలని ఇప్పటికే సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. భూసేకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపు అంశాల్లో పెండింగ్ ప్రతిపాదనలను వేగంగా పరిష్కరించి, అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు సకాలంలో పంపాలని కలెక్టర్ ఆదేశించారు. రాజోలి జలాశయ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణలో పరిహారం చెల్లింపుల కోసం నిధుల అవసరంపై ప్రతిపాదన ప్రభుత్వానికి పంపిన వివరాలను కూడా సమావేశంలో పరిశీలించారు. పట్టాదారు పాస్‌పుస్తకాల ప్రక్రియలో అర్హులైన వారికి త్వరితగతిన పాస్‌పుస్తకాలు అందేలా, అవసరమైన మార్పులు, సవరణలు, వారసత్వ మార్పులు, ఉపవిభజనలు, డిజిటల్ సంతకాల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో పాస్‌పుస్తకాల ప్రక్రియకు సంబంధించి మండలాల వారీగా పురోగతి, పెండింగ్ వివరాలను పరిశీలించారు. పీజీఆర్ఎస్‌పై సమీక్షిస్తూ, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ సూచించారు. పరిష్కరించిన అర్జీలను ముందస్తు, అనంతర పరిశీలనలకు లోబరచి, ఫిర్యాదుదారుల సంతృప్తికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఐవీఆర్ఎస్‌పై సమీక్షిస్తూ, రెవెన్యూ సేవలు, పునఃసర్వే తదితర అంశాలపై ప్రజల నుంచి అందుతున్న అభిప్రాయాలను నిరంతరం పరిశీలించాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వస్తున్న ప్రతికూల స్పందనలకు కారణాలను గుర్తించి సరిదిద్దాలని కలెక్టర్ సూచించారు. అన్ని రెవెన్యూ సేవల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు అవసరమైన సేవలు నిర్ణీత సమయంలో అందేలా సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, తదుపరి నెలవారీ సమీక్ష నాటికి స్పష్టమైన పురోగతి కనిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు హాజరై తమ పరిధిలోని ప్రజా సేవల పురోగతి, పెండింగ్ అంశాల వివరాలను సమర్పించారు.

# కరువు పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి



మదనపల్లె, మహి న్యూస్, ఆగస్టు 18: జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం, ఉద్యాన పంటలు, సూక్ష్మ నీటిపారుదల, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖ, సహకార శాఖ, గ్రామీణ నీటి సరఫరా తదితర ప్రాథమిక రంగాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం కలెక్టరేట్లోని కోర్టు హాలులో సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, లోటు వర్షపాతం ప్రభావం, ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా, ఉద్యాన పంటల సాగు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### వ్యవసాయ రంగంపై సమీక్ష

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 4,60,455 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు సుమారు 50,597 హెక్టార్లలో మాత్రమే విత్తనాలు వేశారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గత పది రోజులుగా వర్షపాతం లేకపోవడంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటికే కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన విత్తనాలు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు పంటల పరిస్థితిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. పంటల బీమాకు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద 1,781 మంది రైతులు, ఇతర బీమా పథకాల కింద 19,021 మంది రైతులు నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. బీమా నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

### ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఉద్యాన పంటల సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 1.35 లక్షల ఎకరాలు కాగా, ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు 1.30 లక్షల ఎకరాల్లో సాగు నమోదైనట్లు అధికారులు తెలిపారు. సుమారు 33 వేల ఎకరాల మేర లోటు ఉన్నట్లు వివరించారు. ముఖ్యంగా టమాటా, ఇతర కూరగాయలు, పూల పంటల సాగు విస్తీర్ణంలో తగ్గుదల ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగుపై ప్రభావాన్ని నిరంతరం అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### ఈ-క్రాప్ నమోదు త్వరగా పూర్తి చేయాలి

రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంలో ఈ-క్రాప్ నమోదు కీలకమని పేర్కొన్న కలెక్టర్, జిల్లాలో ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. పంటల వాస్తవ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా డేటాను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

### తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాలు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న గ్రామాలు, బోర్ల పరిస్థితి, బోర్ల లోతు పెంచడం, మోటార్లను లోతుకు దించడం, నీటి వనరుల రీఛార్జ్ వంటి అంశాలపై సమీక్షించారు. ఎక్కడైనా బోరు లేదా పంప్‌సెట్‌లు మరమ్మతులకు గురైతే వాటిని తక్షణమే మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో నీటి రవాణా, ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగం వంటి చర్యలను ముందుగానే చేపట్టి నీటి సంక్షోభం ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా మిగిలిన శాఖలను కూడా సమీక్షించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. అధికారులు శాఖల వారీగా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆకుల వెంకటేశ్వర్లును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పొన్నాడ



తాళ్లరేవు (మహీ న్యూస్ ), ఆగస్టు 18: ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ తాళ్లరేవు మాజీ గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లును మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తదితరులు పరామర్శించారు. తాళ్లరేవు శివారు శ్రీ రంగ నాయకపురం గ్రామంలో వెంకటేశ్వర్లు స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర నాయకులు వల్లభుని దొరబాబు, కాటం శెట్టి రామ్మూర్తి, పోలేకురు మాజీ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, నాయకులు పొన్నాడ చంటి, బొంతు మోహన్, అద్దంకి లక్ష్మీనారాయణ, పోతాబత్తుల నూకరాజు, కొల్లు శ్రీను, నేల శ్రీను, వినకోటి రామకృష్ణ, మోకా మధు తదితరులు ఉన్నారు.

## యానంలో గంజాయి సేవిస్తే జైలుకే



యానాం, మహి న్యూస్, ఆగస్టు 18: కేంద్ర పాలిత ప్రాంతమైన యానంలో యువత గంజాయి సేవిస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ మేరకు యానంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సీఐ సురేష్ బాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో యానంలో యువత గంజాయి సేవిస్తున్నారంటూ ఫిర్యాదులు రావడంతో రెక్కీ నిర్వహించామని సీఐ తెలిపారు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తున్న కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి, వారికి హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించారు. గంజాయి సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, మత్తులో గొడవలకు పాల్పడే అవకాశం ఉండటంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడతాయని సీఐ సురేష్ బాబు తెలిపారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇకపై ఎవరైనా గంజాయి సేవిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుని పుదుచ్చేరి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో ఎస్సై కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# రహదారుల పరిశుభ్రతకు ప్రాధాన్యత

## 3 మెకానికల్ రోడ్ స్వీపర్ వాహనాలతో ప్రధాన రహదారుల శుభ్రత

## రాత్రింబవళ్లు పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

కర్నూలు, ఆగస్టు 18: (మహి న్యూస్)కర్నూలు: నగరంలోని ప్రధాన రహదారులను పరిశుభ్రంగా ఉంచేందుకు మూడు మెకానికల్ రోడ్ స్వీపర్ వాహనాలను వినియోగిస్తూ రాత్రింబవళ్లు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గతంలో రాత్రి సమయంలో మాత్రమే కొన్ని ప్రధాన రహదారులను శుభ్రపరిచేవారని, ఇకపై పగలు, రాత్రి మొత్తం 16 గంటల పాటు రహదారుల పరిశుభ్రత కార్యక్రమం కొనసాగేలా అదనపు సిబ్బందిని నియమించినట్లు కమిషనర్ వెల్లడించారు. మంగళవారం ఉదయం వై.జంక్షన్ వద్ద పెద్దపాడు రోడ్డులో మెకానికల్ రోడ్ స్వీపర్ వాహనం పనితీరును కమిషనర్ స్వయంగా పరిశీలించారు. రహదారులపై పేరుకుపోయే దుమ్ము, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం శ్రీనివాస నగర్, గుత్తి పెట్రోల్ బంక్, ఓమెగా ఆసుపత్రి ఎదురుగా ఉన్న రోడ్డు, మారుతి నగర్ ప్రాంతాల్లో పర్యటించి పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పరిమళ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి అక్కడి నిర్వహణ, పరిశుభ్రత, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. కమిషనర్ పర్యటనలో ఏసీపీ నాగరాజు, టీఏఈ ఖాసిం వలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆలీంబాష, హుస్సేన్, ఏ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి ఘన స్వాగతం



కర్నూలు, ఆగస్టు 18: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలంలోని కర్నూలు డ్రోన్ సిటీలో నిర్వహించనున్న ఏపీ డ్రోన్ పరిశ్రమల సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి తదితరులు కేంద్ర మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. కర్నూలు డ్రోన్ సిటీలో నిర్వహించనున్న సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో డ్రోన్ పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతికత, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై చర్చించనున్నారు.



# కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ



కర్నూలు, ఆగస్టు 18: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలంలోని కర్నూలు డ్రోన్ సిటీలో నిర్వహించనున్న ఏపీ డ్రోన్ పరిశ్రమల సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు కర్నూలు--ఓర్వకల్లు విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని మంగళవారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.

# కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికిన గౌరు వెంకటరెడ్డి



కర్నూలు, ఆగస్టు 18: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఉన్న కర్నూలు డ్రోన్ సిటీలో ఏర్పాటు చేసిన డ్రోన్ ఎగ్జిబిషన్ స్టాళ్లను తిలకించిన అనంతరం ఏపీ డ్రోన్ పరిశ్రమల సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి ఓర్వకల్లు విమానాశ్రయంలో టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డ్రోన్ సిటీ అభివృద్ధి, కర్నూలు ప్రాంతానికి రానున్న పారిశ్రామిక అవకాశాలపై నాయకులు చర్చించారు.

# ఓటర్ల తాఖీదుల విచారణకు సహకరించాలి

## రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈఆర్వో చల్లా ఓబులేసు విజ్ఞప్తి



కర్నూలు, ఆగస్టు 18: (మహి న్యూస్): ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్--ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా జాబితాలో పేర్లలో తప్పిదాలు, మ్యాపింగ్ లేకపోవడం, తల్లిదండ్రులు, అన్నదమ్ములు తదితర కుటుంబ సభ్యుల వయసుల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) తాఖీదులు జారీ చేశారని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి (ఈఆర్వో), నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. తాఖీదులు అందుకున్న ఓటర్లు నిర్దేశించిన తేదీలో విచారణకు హాజరై తమ అర్జీలు, సంబంధిత ఆధారాలను సమర్పించాలని ఆయన కోరారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈఆర్వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. నోటీసులు జారీ అయిన ఓటర్లు నిర్ణీత సమయంలో స్పందించి విచారణ ప్రక్రియకు సహకరించాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, నోటీసులపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటర్లకు అవగాహన కల్పించి సహకరించాలని ఈఆర్వో కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ ఏఈఆర్వోలు, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ వారిగా ఫొటో, ఓటర్ల జాబితా ప్రచురణకు సన్నద్ధత ఉండాలి



నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 18: మునిసిపాలిటీ వారిగా వారీగా ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణకు అవసరమైన సన్నద్ధత చర్యలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ఆరు నియోజకవర్గ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోనే కలెక్టర్ ఛాంబర్ నందు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, త్రాగునీటి సరఫరా కొరకు చేపట్టవలసిన చర్యలు, పరిశుభ్రత పై జెడ్పి సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని లలితా బాయి, ఆరు మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు అన్ని మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఫోటో, ఓటర్ల జాబితాను సిద్ధం చేసి 03-09-26 వ తేదీన సంబంధిత కార్యాలయాల్లో ప్రచురించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల పరిశీలన మరియు ప్రచురణ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు కార్యక్రమం 18.08.2026 నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరాపై మందస్తు చర్యలు తీసుకొని ఎక్కడ కూడా త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో పగడ్బందీగా చేపట్టాలని స్వచ్ఛతపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు.

# దేశంలోనే కర్నూలు డ్రోన్ సిటీ మొట్టమొదటిది



## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తో ఓర్వకల్లు డ్రోన్ సిటీకి శ్రీకారం

## ఓర్వకల్లు డ్రోన్ సిటీలో సమగ్ర డ్రోన్ ఎకోసిస్టమ్ అభివృద్ధే లక్ష్యం

## స్టోన్స్ నుంచి డ్రోన్ల దిశగా ఓర్వకల్లు రూపాంతరం

## డ్రోన్ శక్తి.. యువ శక్తితోనే సాధ్యం

కర్నూలు, ఆగస్టు 18: (మహి న్యూస్): కర్నూలు: దేశంలోనే కర్నూలు డ్రోన్ సిటీ మొట్టమొదటిదని, డ్రోన్ టెక్నాలజీ రంగంలో కర్నూలు జిల్లాను జాతీయ స్థాయి హబ్‌గా అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేసిన కర్నూలు డ్రోన్ సిటీలో డ్రోన్ ఎగ్జిబిషన్ స్టాళ్లను కేంద్ర



మంత్రి తిలకించారు. అనంతరం అక్కడ నిర్వహించిన ఏపీ డ్రోన్ పరిశ్రమల సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని డ్రోన్ పరిశ్రమ అభివృద్ధిపై పరిశ్రమ ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, డ్రోన్ టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో కర్నూలులో డ్రోన్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తో ఓర్వకల్లు డ్రోన్ సిటీకి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. 2024లో అమరావతిలో జరిగిన డ్రోన్ సమ్మిట్‌లోనే కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారని, ఇది ఆయన ముందుచూపుకు నిదర్శనమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, క్వాంటమ్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతికతలను ప్రోత్సహించడంలో ముఖ్యమంత్రి ఎప్పుడూ ముందుంటారని మంత్రి తెలిపారు.

### సమగ్ర డ్రోన్ ఎకోసిస్టమ్

డ్రోన్ల తయారీ, టెస్టింగ్, పరిశోధన, శిక్షణ, ఆవిష్కరణలు, సర్టిఫికేషన్, సేవలు తదితర అన్ని కార్యకలాపాలను ఒకే చోట అనుసంధానిస్తూ ఓర్వకల్లు డ్రోన్ సిటీలో సమగ్ర డ్రోన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించేలా అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తదితర సంస్థల సమన్వయంతో శాండ్‌బాక్స్, టెస్టింగ్, సర్టిఫికేషన్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 'స్టోన్స్ నుంచి డ్రోన్ల దిశగా' ఓర్వకల్లును దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు. డ్రోన్ పరిశ్రమ సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ బియాండ్ విజువల్ లైన్ ఆఫ్ సైట్ (బీవీఎల్ఓఎస్) సాంకేతికత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విజయవాడ వరదల సమయంలో డ్రోన్ల వినియోగం ద్వారా బాధిత ప్రాంతాలకు సహాయక సామగ్రిని వేగంగా చేరవేయవచ్చని నిరూపితమైందన్నారు. వ్యవసాయం, వైద్యం, లాజిస్టిక్స్, కార్గో, నిఘా, శాంతిభద్రతలు తదితర రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

### 10 ఏళ్లలో 100 కొత్త విమానాశ్రయాలు

రానున్న పదేళ్లలో దేశంలో 100 కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 5 లక్షల మంది విమాన ప్రయాణాలు చేస్తున్నారని, భవిష్యత్‌లో మరో 1,700 విమానాలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో డ్రోన్ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యాలకు అనుగుణంగా డ్రోన్ పరిశ్రమను కీలక రంగంగా అభివృద్ధి చేసేందుకు డ్రోన్ రూల్స్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ), దిగుమతి నియంత్రణలు వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బీవీఎల్ఓఎస్, అన్‌మ్యాన్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ (యూటీఎం) వ్యవస్థల అభివృద్ధితో పాటు అనుమతులు, సర్టిఫికేషన్లు, లైసెన్సుల ప్రక్రియను డిజిటలైజ్ చేసి కాలపరిమితితో కూడిన అనుమతుల వ్యవస్థను సులభతరం చేస్తున్నామని చెప్పారు.

### మూడు నెలల్లో ఈ-జీసీఏ మెరుగుదల



డ్రోన్ పరిశ్రమలో సర్టిఫికేషన్, అనుమతులు, లైసెన్సింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ఈ-జీసీఏ వ్యవస్థను మూడు నెలల్లో మరింత మెరుగుపరుస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ-జీసీఏ 2.0 ద్వారా దరఖాస్తుల స్థితి, అనుమతుల ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకు పురోగతిని సమీక్షిస్తామని వెల్లడించారు. పీఎల్ఐ పథకం ద్వారా డ్రోన్ ఉత్పత్తి, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

### ప్రతి గ్రామానికి డ్రోన్ అందుబాటులోకి రావాలి

దేశంలోని 6 లక్షలకు పైగా గ్రామాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామానికి కనీసం ఒక డ్రోన్ అందుబాటులోకి వస్తే భారీ మార్కెట్ అవకాశాలు ఏర్పడతాయని మంత్రి అన్నారు. మోటార్లు, కంట్రోలర్లు, సెన్సర్లు, బ్యాటరీలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు వంటి డ్రోన్ విడిభాగాల దేశీయ తయారీపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం 30--35 శాతంగా ఉన్న



స్వదేశీకరణను మరింత పెంచేందుకు ఐఐటీలు, ఐఐఐటీలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో కలిసి పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. డ్రోన్ సేవలను కేవలం తయారీ, ప్రభుత్వ, రక్షణ రంగాలకే పరిమితం చేయకుండా సామాన్య ప్రజల వ్యక్తిగత అవసరాలకు కూడా 'ఊబరైజేషన్' తరహాలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో విజయవంతమైన డ్రోన్ సేవలను 'లాస్ట్ మైల్' వరకు విస్తరించి ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడమే తదుపరి లక్ష్యమన్నారు.

### యువ శక్తిని డ్రోన్ శక్తిగా మార్చాలి

భారతదేశాన్ని స్వాతంత్ర్య శతాబ్ది నాటికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. 'డ్రోన్ శక్తి'ని 'యువ శక్తి'గా మార్చేలా యువత డ్రోన్ టెక్నాలజీలో పూర్తిస్థాయిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రోన్ రంగ అభివృద్ధికి యువత ప్రతిభను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కర్నూలు ప్రాంతంలోని కనెక్టివిటీ, లొకేషన్ అడ్వాంటేజ్‌ను సద్వినియోగం చేసుకుని ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. కర్నూలులో హోటళ్లు, వసతి, రెస్టారెంట్లు, వినోదం, వ్యాపార మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని కర్నూలు ఎంపీ, పెట్టుబడిదారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో ఓర్వకల్లు డ్రోన్ సిటీ కర్నూలు ఆర్థికాభివృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

# హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలు అరెస్ట్

## నేరానికి ఉపయోగించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

## నిందితులకు తప్పించుకునేందుకు సహకరించిన మరో 11 మందిని కేసులో చేర్చిన పోలీసులు



కర్నూలు, ఆగస్టు 18: (మహి న్యూస్): కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నేరం అనంతరం పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోవడానికి సహకరించిన, ముద్దాయిలకు ఆశ్రయం కల్పించిన మరో 11 మందిని కూడా కేసులో చేర్చారు.

### అరెస్టయిన ముద్దాయిల వివరాలు

1. షేక్ ఇమ్రాన్ (38) – గనిగల్లీ, కర్నూలు టౌన్
2. మహమ్మద్ జవాద్ (25) – 1 టౌన్ ప్రాంతం, కర్నూలు టౌన్
3. ఎస్.ఎం.డి. ఇర్ఫాజ్ (27) – మొగల్‌పుర వీధి, కర్నూలు టౌన్

కర్నూలు టౌన్‌లోని మాసూం బాషా దర్గా సమీపంలోని టీ స్టాల్ వద్ద ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో షేక్ ఇంతియాజ్‌పై ముద్దాయిలు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. చాతిపై గుద్ది, తలపై బండరాయితో విచక్షణారహితంగా మోది తీవ్ర రక్తగాయాలు కలిగించడంతో ఇంతియాజ్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తమ్ముడు షేక్ ఇలియాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు 1 టౌన్ పోలీసులు క్రైమ్ నంబర్ 78/2026, సెక్షన్ 103, 49 రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ప్రత్యేక బృందాలతో గాలింపు

జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర ఆధ్వర్యంలో కర్నూలు 1 టౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మారుతి శంకర్, కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. తబ్రేజ్ మరియు పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముద్దాయిల కోసం గాలింపు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 17న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కర్నూలు టౌన్ జొహరాపురం పక్కి మసీదు వద్ద ఇద్దరు ముద్దాయిలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఒకరి వద్ద నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్, మరొకరి వద్ద ఏపీ40-డీవై-09803 రిజిస్ట్రేషన్ నంబర్ గల రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటల సమయంలో జొహరాపురం ఇందిరమ్మ గృహాల వద్ద మరో ముద్దాయిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

### మరో 11 మంది ముద్దాయిలు కేసులో చేర్పు

హత్య అనంతరం ప్రధాన ముద్దాయిలు పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని పారిపోవడానికి సహకరించినవారిని, వారికి ఆశ్రయం కల్పించినవారిని గుర్తించిన పోలీసులు మరో 11 మందిని కేసులో ముద్దాయిలుగా చేర్చారు. వారి పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### సెప్టెంబర్ 1 వరకు జ్యుడీషియల్ కస్టడీ

అరెస్ట్ చేసిన ముగ్గురు ముద్దాయిలను గౌరవనీయ జేఎఫ్‌సీఎం కర్నూలు కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారిని 01.09.2026 వరకు జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేసింది. కేసును సత్వరం ఛేదించి ముద్దాయిలను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ అభినందించారు. – సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయం, కర్నూలు

# ఎస్ఆర్బీసీ కాలనీలో టిడ్కో గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా



నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 18: ఎస్ఆర్బీసీ కాలనీలోని టిడ్కో గృహాలలో మౌలిక సదుపాయాలని పూర్తి చేసి లబ్ధిదారులకు గృహాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎస్ఆర్బీసీ కాలనీలోని టిడ్కో గృహాలను మున్సిపల్ కమిషనర్ శేషన్న, మున్సిపల్ ఇంజినీర్, డీఈఈ, ɔ×ణజా అధికారుల తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఆర్బీసీ కాలనీలో టిడ్కో గృహాలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, రహదారులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. టిడ్కో గృహాలకు సంబంధించి సంబంధిత అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి నిర్దేశిత గడువులోపు పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని మున్సిపల్ మరియు ɔ×ణజా అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్యం, తాగునీరు తదితర ప్రాథమిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కాలనీ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజినీర్, డీఈఈ, టిడ్కో అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com